సాక్షి
రంగారెడ్డి

శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



ఊరెళ్లొచ్చే సరికి ఊడ్చేశారు

ఇంటికి తాళంవేసి ఊరికి వెళ్లి వచ్చే సరికి దుండగులు చోరీకి పాల్పడ్డారు. బీరువాలో ఉన్న నగలు, నగదు దోచుకెళ్లారు. 10లో▸



ట్రాక్టర్ బోల్తా

పనికి వెళ్తుండగా ట్రాక్టర్ బోల్తాపడడంతో ఒకరు మృతిచెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. 10లో▸



మాది చేతల ప్రభుత్వం

మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

విద్యాభివృద్ధికి 'సాక్షి' కృషి అభినందనీయం



ఎంఈఓకు సాక్షి దినపత్రికను అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: విద్యాభివృద్ధికి సాక్షి దినపత్రిక చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి ఏటా తన సొంత ఖర్చులతో సాక్షి దినపత్రికను అందిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎంఈఓ మనోహర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బన్సీలాల్, నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ముబారక్‌అలీ, సాక్షి సర్క్యులేషన్ ఆఫీసర్ అన్వర్, ఎస్‌ఆర్ ఆంజనేయులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలశీతలీకరణ కేంద్రంలో తనిఖీ



పాల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

కడ్తాల్: మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రాన్ని శుక్రవారం తెలంగాణ పాడి పరిశ్రామిభివృద్ధి సహకార సమాఖ్య చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి కవిత, జనరల్ మేనేజర్ మధుసూదన్‌రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ పాలసేకరణ కేంద్రాల ద్వారా పాలశీతలీకరణ కేంద్రానికి వచ్చిన పాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా రైతుల నుంచి పాలు సేకరించాలని సూచించారు. పాడి పశువులకు సరైన పోషకాలు అందించేలా, నాణ్యమైన పాలను ఉత్పత్తి చేసేలా పాడి రైతులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మురళి, మెనేజర్ ప్రాణేశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి టీఎల్‌ఎం మేళాకు ఎంపిక



దీపికకు ప్రశంసాపత్రం అందిస్తున్న డీఈఓ సుశీందర్‌రావు

ఇబ్రహీంపట్నం: స్థానిక వెంకటరమణ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు దీపిక రాష్ట్రస్థాయి టీఎల్‌ఎం మేళాకు ఎంపికైంది. తుక్కుగూడలోని దేవేంద్ర పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళాలో ఇంగ్లిష్‌లో దీపిక ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. దీంతో రాష్ట్రస్థాయి పోటీకి అర్హత సాధించింది. ఈ సందర్భంగా దీపికకు జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ప్రశంసాపత్రం అందించి అభినందనలు తెలిపారు.

సింబయాసిస్‌లో జాతీయ సదస్సు



సెమినార్‌లో మాట్లాడుతున్న యునెస్కో పాలక మండలి చైర్మన్, ప్రొఫెసర్ శర్మ

నందిగామ: మండల పరిధిలోని సింబయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీలో గురువారం ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి యునెస్కో పాలక మండలి చైర్మన్ ప్రొఫెసర్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారతీయ జ్ఞాన వ్యవస్థ, సమకాలీన శాస్త్రీయ, ఆర్థిక, వ్యాపార లక్ష్యాల విశిష్టత ఎంతో గొప్పదని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొఫెసర్ వేణుగోపాల్, మాజీ ఎంపీ వర్మ, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ధమాకా!

మహానేత వైఎస్సార్ పథకానికి మళ్లీ ప్రాణం

- ప్రాణహిత – చేవెళ్లకు రీ డిజైన్‌తో నీటి కేటాయింపులు
- 'కేపీ లక్ష్మీదేవిపల్లి'కి లైన్ క్లియర్
- ఇప్పటికే పట్టాలెక్కిన 'కొడంగల్ – నారాయణపేట'
- సస్యశ్యామలం చేసే దిశగా అడుగులు



పాలమూరు ఎత్తిపోతల పథకం

వికారాబాద్: దివంగత సీఎం వైఎస్సార్ మానస పుత్రికగా పిలువబడే ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు మళ్లీ ప్రాణం పోసుకుంది. ఉమ్మడి రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాలో అంతర్భాగంగా ఉన్న ఈ ప్రాజెక్టును గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ చేసి కాళేశ్వరంగా మార్చిన విషయం తెలిసిందే. దీంతో జిల్లాకు నీటి కేటాయింపులు లేకుండా పోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ తెరపైకి వచ్చింది. అందులో వికారాబాద్ జిల్లాను చేర్చడంతో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి నీరందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవల పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అధికారులతో కలిసి ప్రాజెక్టు నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. కొడంగల్ – నారాయణపేట్ ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే మూడు ప్రాజెక్టుల ద్వారా సాగునీరందనుంది. ఈ మూడు ప్రాజెక్టుల చివరి భాగం జిల్లా కావడంతో ఏదో ఒకదాని నుంచి నీరందించేందుకు వీలవుతుందని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. జిల్లాలో ఆరు లక్షల పైచిలుకు ఎకరాల సాగు భూమి ఉండగా పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించే కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ద్వారా వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాలతో పాటు చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని 2.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా 2.47 లక్షల ఎకరాలకు.. నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా నీరందనుంది.

రీ డిజైన్ల పేరుతో..

ఇప్పటి వరకు ప్రధాన ప్రాజెక్టులన్నింటికీ ఏదో ఒక కొర్రీ పెట్టి కొండెక్కిస్తూ వచ్చారు. పలుసార్లు సర్వేలు.. రీ డిజైన్లు.. కేసులు అంటూ కాలయాపన చేశారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని దశాబ్దాలుగా సర్వేలకే పరిమితం చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు 50 టీఎంసీల కేటాయింపులు ఉన్న ప్రాణహిత – చేవెళ్లను రీ డిజైన్ పేరుతో గత ప్రభుత్వం అటకెక్కించింది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతల పథకం సర్వే కోసం రూ.6.91 కోట్లు ఖర్చు చేసింది. ఈ ప్రాజెక్టుకు మొత్తం 115 టీఎంసీల నీటి కేటాయింపులు జరగ్గా అందులో 45 టీఎంసీల సామర్థ్యంలో పరిగి నియోజకవర్గంలో రిజర్వాయర్లు కట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో గండేడ్, కుల్కచర్ల మండలంలో నిర్మించే రిజర్వాయర్ సామర్థ్యం 35 టీఎంసీలుగా ప్రస్తావించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టులో భాగంగా పరిగి మండలం రావులపల్లి శివారులో 10 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలని నిర్ణయించారు. తద్వారా వికారాబాద్ జిల్లాలోని 2,46,154 ఎకరాలకు నీరందించాలని భావించారు. రాష్ట్రం విడిపోవడం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అనేకసార్లు డిజైన్లు మారుస్తూ వచ్చారు. చివరికి గ్రావిటీ ద్వారానే జిల్లాకు నీరందిస్తామని చెప్పారు. కానీ అది కూడా పూర్తి చేయలేదు. ప్రధాన ప్రాజెక్టుల విషయంలో అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవటానికే పరిమితమయ్యారే తప్ప మేలు చేయలేదు. ఇటీవల బడ్జెట్ సమావేశాల్లో పేర్కొన్నట్లుగా కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టునైనా పూర్తిచేసి పొలాలను తడపాలని రైతులు కోరుతున్నారు.

రాజధానికి దగ్గరగా ఉన్నా..

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా పరిస్థితి దీపం చుట్టూ చీకట్లే అన్న చందంగా తయారైంది. అభివృద్ధిలో అందనంత దూరంలో ఉండిపోయింది. దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యం.. నోరు మెదపని నేతల తీరు వెనుకబాటుకు కారణంగా చెప్పొచ్చు. చిన్న చిన్న చెరువులు మినహా ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా లేదు.. నదుల ద్వారా సెంటు భూమి కూడా తడవని పరిస్థితి.. పరిశ్రమలు లేని జిల్లా ఏదైనా ఉందంటే అది వికారాబాదే.. ప్రస్తుతం జిల్లాకు చెందిన వ్యక్తే సీఎంగా ఉండటం, మరొకరు కీలకమైన స్పీకర్ పదవిలో ఉండటం.. మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలూ అధికార పార్టీకి చెందినవారే కావడంతో ఈ ప్రాంత అభివృద్ధికి బీజం పడింది. సాగునీటి ప్రాజెక్టులపై ఆశలు చిగురించాయి. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి జిల్లాకు నీరందించే ప్రాజెక్టులపై పలుమార్లు అసెంబ్లీలో లేవనెత్తడం దానికి ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం రైతుల్లో సంతోషాన్ని నింపింది.

ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది



అసెంబ్లీ సాక్షిగా కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తామని చెప్పడం శుభ పరిణామం. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని ఉపముఖ్యమంత్రి నుంచి హామీ తీసుకున్నాం. ఈ ప్రాజెక్టు పూర్తయితే గొప్ప వరంగా మారుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత వైఎస్సార్ తన విజ్ఞప్తి మేరకే ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలో జిల్లాను చేర్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాన్ని అటకెక్కించింది. ప్రస్తుతం దీనిపై సీఎం సానుకూలంగా ఉన్నారు. కచ్చితంగా అన్ని ప్రాజెక్టులను నిర్మించి తీరుతాం.

– రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి



ఇబ్రహీంపట్నంలో కురుస్తున్న వర్షం

దండుమైలారంలో భారీ వర్షం

ఇబ్రహీంపట్నం: వర్షం దంచికొట్టింది. శుక్రవారం రాత్రి 9 గంటల వరకు రికార్డు స్థాయిలో దండుమైలారంలో 105.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇబ్రహీంపట్నంలో 26.8 మి.మీటర్లు, మంగల్‌పల్లిలో 12.3 మి.మీటర్ల వర్షం కురిసింది. సాయంత్రం వేళ వర్షం ప్రారంభంకావడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రోడ్లపై జనసంచారం పూర్తిగా తగ్గింది. గురువారం ఇబ్రహీంపట్నంలో 44.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. పదిహేను రోజులుగా ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు సురుకుబెట్టాలే

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

శ్రీనగర్‌కాలనీ: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 420 వాగ్దానాల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన ఎర్రగడ్డ డివిజన్ ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడపిల్ల పెళ్లికి తులం బంగారం ఇస్తామని, అమ్మాయిలు బడి పోయేందుకు స్కూటీ ఇస్తామన్న కాంగ్రెస్ వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. స్కూటీలు లేవు గానీ లూటీ మాత్రం జోర్దార్‌గా నడుస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని బస్తీల్లో హైడ్రా వచ్చి ఎప్పుడు ఇళ్లు కూలగొడుతుందోననే భయంతో స్థానికులు జీవిస్తున్నారని చెప్పారు. 24 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం గరీబోళ్ల ఇళ్లు కూలగొట్టుడు తప్ప ఏమి చేసిందని ప్రశ్నించారు. కూకట్‌పల్లిలో బుచ్చమ్మ అనే మహిళ.. తన ఇల్లు కూలగొడతారనే భయంలో ఉరి వేసుకొని చనిపోయిందని, ఆమెకు వచ్చిన కష్టం ఏ ఆడబిడ్డకు రాకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఏ ఆడబిడ్డకూ కష్టం కలిగించలేదని, లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్‌కు సురుకు పెట్టుడు ప్రారంభం కావాలంటే అది జూబ్లీహిల్స్ ఎన్నికతోనే జరగాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. చివరిశ్వాస వరకూ ప్రజాసేవలో ఉన్న మాగంటి గోపీనాథ్ కుటుంబానికి కార్యకర్తలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మాగంటి సునీత మాట్లాడుతూ.. కార్యకర్తలు బీఆర్‌ఎస్‌కు భారీ విజయాన్ని అందించి మాగంటికి నివాళిగా అందించాలని కోరారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ దేదీప్య, ఎర్రగడ్డ డివిజన్ ముఖ్య నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఇబ్రహీంపట్నం రూరల్: కొత్తగా మహిళా స్వయం శక్తి సంఘాలను ఏర్పాటు చేయాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటనారాయణ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం 18 మున్సిపాలిటీల్లో పని చేస్తున్న టౌన్ మిషన్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, రిసోర్సు పర్సన్లకు అవగాహన, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వీధి వ్యాపారులకు అందించాల్సిన సౌకర్యాలపై అదనపు మిషన్ డైరెక్టర్ మెప్మా మురళీ మోహన్, స్టే అధికారి కృష్ణ చైతన్య అవగాహన కల్పించారు. మహిళా సంఘాలకు రుణాల టార్గెట్, అచీవ్‌మెంట్ గురించి వివరించారు. కార్యక్రమంలో డీఎంసీ ఇందిర, ఏడీఎంసీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రశంస



సేవా పతకం అందుకుంటున్న ఎస్‌ఐ రాజు

పహాడీషరీఫ్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ ఎస్‌ఐ ఎ.ఎ.రాజును రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు అభినందించారు. ఈ మేరకు శుక్రవారం సేవా పతకం అందజేశారు. కత్తి మీది సాము లాంటి పోలీస్ శాఖలో ఎలాంటి రిమార్కులు లేకుండా ముందుకు సాగుతూ ఇలాంటి పురస్కారాలు అందుకోవడాన్ని మిగతా సిబ్బంది ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం

షాద్‌నగర్: షాద్‌నగర్ పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది సబియా సుల్తానాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డిని నియమించింది. వీరికి పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

నేరాలను నియంత్రించాలి

మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజలకు పోలీసులు దగ్గరవ్వాలని, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి అధికారులు, సిబ్బందికి సూచించారు. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విజిబుల్ పోలీసింగ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. కాలనీలు, గ్రామాలు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ప్రార్థనా మందిరాలు, షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్ ప్రాంతాల వంటి రద్దీ ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు పెంచాలన్నారు. నేరాల నియంత్రణకు పాటుపడాలన్నారు. సున్నితమైన ప్రాంతాల్లో భద్రత మరింత పెంచి, సోషల్ మీడియాపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఆదిబట్ల సీఐ రవికుమార్, ఎస్‌ఐలు వెంకటేశ్, నోయల్‌రాజ్, సైదయ్య, సత్యనారాయణ, ఏఎస్‌ఐలు యాదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

ఉన్నత లక్ష్యంతో చదవాలి

యాచారం: విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించడం కోసం కష్టపడి చదువుకోవాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి సూచించారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శుక్రవారం యాచారం ఉన్నత పాఠశాల ఆవరణను శుభ్రం చేసి మొక్కలు నాటి నీళ్లు పోశారు. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతపై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, నాణ్యతలో రాజీపడొద్దని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రాధారాణితో సమావేశమై రికార్డులు పరిశీలించారు. అభివృద్ధి పనులపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యాచారం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నర్సింహ, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

మంచాల: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని మంచాల, జాపాల, రంగాపూర్ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. జాపాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలశంకర్, ఎంపీఓ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని లింగంపల్లి గేట్ వద్ద ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని సీపీఎం నాయకులు జెడ్పీ సీఈఓకు వినతిపత్రం అందజేశారు.



మొక్క నాటి నీళ్లు పోస్తున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

షాద్‌నగర్‌రూరల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి రైల్వేగేట్, చటాన్‌పల్లి ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీ చేట్టారు. కిరాణా దుకాణాలు, బెల్టుషాపులు, దాబాలు, లాడ్జీలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. శాంతి భద్రతలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిషేధిత గుట్కాలు, అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చర్యలు తప్పవని అన్నారు. లాడ్జీల యజమానులు అన్ని అనుమతులు తీసుకోవాలని, లాడ్జీలకు వచ్చే వారి పూర్తి సమాచారం సేకరించాలని, ఎలాంటి ఘటనలు చోటుచేసుకున్నా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రాత్రి సమయాల్లో అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని, అలాంటి వారు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దాబాల్లో అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు చేయొద్దన్నారు. బెల్టు షాపుల్లో మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. తనిఖీల్లో పట్టణ సీఐ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ నర్సయ్య, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ, సిబ్బంది

బాచుపల్లిలో బోసిపోయి..

- తుర్కయంజాల్‌లో కేవలం 2 ప్లాట్‌లకే బేరం
- హెచ్‌ఎండీఏ భూములకు స్పందన శూన్యం

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ భూములపై కొనుగోలుదారులు విముఖత చూపారు. బాచుపల్లిలో మొత్తం 70 ప్లాట్‌లకు ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించగా ఒక్క ప్లాట్ కూడా విక్రయించలేకపోయారు. తుర్కయంజాల్‌లో 12 ప్లాట్‌లలో కేవలం 2 మాత్రమే అమ్ముడయ్యాయి. గజానికి రూ.65,000 కనీస ధర నిర్ణయించగా రూ.1.15 లక్షలకు గజం చొప్పున ఒక ప్లాట్‌ను, రూ.75,000కు గజం చొప్పున మరో ప్లాట్‌ను విక్రయించారు. బాచుపల్లిలో కనీసం బోణీ కూడా కాకపోవడంతో హెచ్‌ఎండీఏ అధికారులు విస్మయం వ్యక్తం చేశారు.

రూ.600 కోట్లకుపైగా ఆదాయం వస్తుందని..

సుమారు రెండేళ్ల విరామం తర్వాత భూముల అమ్మకాలకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) శ్రీకారం చుట్టింది. ఈ రెండు చోట్ల ఉన్న స్థలాలతో పాటు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా మిగిలిపోయిన స్థలాల అమ్మకాల ద్వారా దాదాపు రూ.600 కోట్లకు పైగా ఆదాయం లభిస్తుందని అంచనా వేశారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో మూడు రోజుల పాటు ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించారు. ఇటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నిర్మాణరంగానికి చెందిన సంస్థల నుంచి, అటు మధ్యతరగతి వర్గాల నుంచి స్పందన కనిపించలేదు. హెచ్‌ఎండీఏ ప్లాట్‌లు కొనుగోలు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపలేకపోయారు. ప్లాట్‌ల వేలానికి ముందు నిర్వహించిన ప్రీబిడ్డింగ్ సమావేశాల్లోనూ కొనుగోలుదారుల నుంచి స్పందన లభించకపోవడం గమనార్హం.



ప్రస్తుతం మార్కెట్‌లో నెలకొన్న స్తబ్దత కారణంగా విక్రయించలేకపోయినట్లు అధికారులు తెలిపారు.

ధరలు ఎక్కువే..

రెండు చోట్ల హెచ్‌ఎండీఏ నిర్ణయించిన బేసిక్ ధరలపై మొదటి నుంచీ భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. తుర్కయంజాల్‌లో చదరపు గజానికి రూ.65,000 చొప్పున ధర నిర్ణయించారు. ప్రస్తుత స్తబ్దత కారణంగా మార్కెట్ ధరల కంటే ఇవి ఎక్కువే. ప్రస్తుతం అక్కడ గజానికి రూ.40,000 నుంచి రూ.45,000 ధర ఉన్నట్లు అంచనా. కానీ.. హెచ్‌ఎండీఏ అధికారులు కనీస ధరలను అమాంతం పెంచారు. ఒక్కోప్లాట్ కనిష్టంగా 600 గజాల నుంచి 1,146 గజాల వరకు మొత్తం 12 ప్లాట్‌లు ఉన్నాయి. వీటి పరిమాణాలు నాలుగు వైపులా సమంగా లేకపోవడంతో కొనుగోలుదారులు ముందుకు రాలేదని తెలిసింది. బాచుపల్లిలోని స్థలాలకు గజానికి రూ.70,000 చొప్పున కనీస ధరను నిర్ణయించారు. కానీ.. స్థానికంగా ఉన్న మార్కెట్ ధరల కంటే ఎక్కువేననే అభిప్రాయం ఉంది. కనిష్ఠంగా 266.67 గజాల నుంచి గరిష్ఠంగా 499.96 గజాల వరకు ఈ ప్లాట్ సైజ్‌లు ఉన్నాయి. ఈ లేఅవుట్‌కు సరైన అప్రోచ్ రోడ్ లేకపోవడం ఒక లోపమనే చెప్పాలి.

ట్రాక్టర్ బోల్తా

ఒకరి మృతి, నలుగురికి గాయాలు


జంగయ్య (ఫైల్)

ఆమనగల్లు: ట్రాక్టర్ బోల్తాపడడంతో ఒకరు మృతిచెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన తలకొండపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొట్ర గ్రామానికి చెందిన జంగయ్య (50) రెండు నెలలుగా మిడ్జిల్‌లో సిమెంట్ ఇటుకల తయారీ పనులకు వెళ్తున్నాడు. శుక్రవారం మరో నలుగురు కూలీలతో కలిసి సిమెంట్ ఇటుకలను ట్రాక్టర్‌లో నింపుకొని తలకొండపల్లి మండలం మాదాయిపల్లికి వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. జంగయ్యపై ఇటుకలు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నలుగురికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మాదాయిపల్లి వద్ద బోల్తాపడిన ట్రాక్టర్

ఊరెళ్లొచ్చే సరికి ఊడ్చేశారు

షాద్‌నగర్‌రూరల్: ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లి వచ్చే సరికి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ శివారెడ్డి కథనం ప్రకారం .. మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి విద్యుత్ లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ కుటుంబంతో పట్టణంలోని న్యూభాగ్యనగర్ కాలనీలో నివసిస్తున్నారు. పెత్తర అమావాస్య సందర్భంగా పెద్దలకు కర్మ కార్యక్రమాలు నిర్వహించేందుకు గురువారం ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి సొంత గ్రామమైన వనపర్తికి బయలుదేరారు. ఇంట్లో ఎవరూ లేకపోవడం గమనించిన దుండగులు అర్ధరాత్రి సమయంలో తాళం విరగ్గొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న 12 గ్రాముల బంగారం, కిలోన్నర వెండి, రూ.78వేల నగదు దోచుకెళ్లారు. కాలేజీకి వెళ్లాలని శ్రీనివాస్ కుమారుడు శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో బీరువా తెరిచి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకొని ఇంటికి వచ్చిన శ్రీనివాస్ బీరువాలోని బంగారం, వెండి, నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శివారెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి ఆదేకాలనీలో పోలీస్ కానిస్టేబుల్ శివలింగం కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దాదాపు రూ. లక్ష విలువచేసే నూతన విద్యుత్ వైర్లను దొంగిలించారు. శివారు కాలనీల్లో వరుస దొంగతనాలు జరుగుతుండంతో ఆయా కాలనీల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.


చిందర వందరగా పడేసిన వస్తువులు

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు 36 మంది విద్యార్థులు

జోనల్ సెక్రెటరీ ప్రభాకర్

శంకర్‌పల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు జోనల్ సెక్రెటరీ ప్రభాకర్ అన్నారు. మండలం పరిధిలోని జన్వాడలో ఏర్పాటు చేసిన ఈ ఎంపికలకు జోన్ (చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలు) నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో అండర్-14లో 18 మంది, అండర్-17 విభాగంలో 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. జోనల్ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు త్వరలో హైదరాబాద్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఎంపికలో ఫిజికల్ డైరెక్టర్లు బస్వరాజ్, శంకర్, అరుంధతి, పల్లవి, నాగ సంధ్య, అనురాధ, మల్లేశ్, రవీందర్, శ్రీనివాస్, ఆనంద్, అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ప్రభాకర్, ఫిజికల్ డైరెక్టర్లు

పాఠశాలకు నిధులు మంజూరు చేయండి

యాచారం: కలెక్టర్ నారాయణరెడ్డికి రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి ఫోన్ చేశారు. యాచారం ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు శుక్రవారం ఉదయం కోదండరెడ్డిని కలిశారు. పాఠశాల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరయ్యేలా చూడాలని వినతిపత్రం అందజేశారు. దీంతో వెంటనే ఆయన కలెక్టర్‌కు ఫోన్ చేసి పాఠశాల ప్రహరీ నిర్మాణం, విద్యార్థుల తాగునీటి పరిష్కారం కోసం బోరుబావి తవ్వించి మోటార్ బిగించడానికి కావాల్సిన నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని సూచించారు. స్పందించిన కలెక్టర్ నిధులు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్

మాడ్గుల: మండల పరిధిలోని కలకొండ శివారు వాగు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేశారు. సీఐ వేణుగోపాల్‌రావు తెలిపిన ప్రకారం.. శుక్రవారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ టిప్పర్‌లో మట్టి తరలిస్తున్నారు. గమనించిన పోలీసులు వాహనాన్ని నిలిపి తనిఖీలు చేపట్టగా ఎటువంటి అనుమతి పత్రాలు లేవని చెప్పారు. దీంతో వాహన డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసి టిప్పర్ సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

24న బీఆర్ఓయూ ఎంబీఏ అడ్మిషన్స్‌కు కౌన్సెలింగ్

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి ఎంబీఏ (హాస్పిటల్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) కోర్సుల్లో చేరడానికి సెప్టెంబర్ 24న వర్సిటీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకునేవారు 2025-26 తెలంగాణ ఐసెట్ లేదా అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎంబీఏ హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత సాధించాలన్నారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను చూడవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

భయం నీడన బాలిక!

మైనర్లకు రక్షణ కరువు

- ఏటా పెరుగుతున్న అదృశ్యాలు, అఘాయిత్యాలు
- పరువు పోతుందని ఫిర్యాదుకు వెనుకాడుతున్న బాధిత తల్లిదండ్రులు

- తాండూరులోని సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో చదువుతున్న ఓ బాలికతో వైస్ ప్రిన్సిపల్ బాలస్వామి అనుచితంగా ప్రవర్తిస్తున్నాడు. అతని అకృత్యాలను భరించలేని విద్యార్థిని ఈనెల 10న తల్లిదండ్రులకు విషయం చెప్పింది. దీంతో మరుసటి రోజు పాఠశాలకు వెళ్లిన బాలిక కుటుంబ సభ్యులు అతడిని చితకబాదారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరువుపోతుందనే కారణంతో అక్కడితోనే ఆగిపోయారు.
- కూతుళ్లను బాగా చదివించాలనే ఉద్దేశంతో ఓ కుటుంబం పట్టణంలోని సాయిపూర్‌లో ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటోంది. పదో తరగతి చదువుతున్న బాలిక ఉన్నట్టుండి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మరణానికి లైంగిక వేధింపులే కారణమని తెలియడంతో శవాన్ని తీసుకెళ్లి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. బిడ్డను పోగొట్టుకున్న పుట్టెడు దుఃఖంలో.. పరువును కూడా పోగొట్టుకోలేక పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కలేదు.

తాండూరు: పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో బాలికలపై వేధింపులు పెచ్చుమీరాయి. వీటిని తట్టుకోలేక అభంశుభం తెలియని విద్యార్థినులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఏటా పదుల సంఖ్యలో బాలికలు అదృశ్యమవుతున్నా వీటిని కట్టడం చేయడంలో పోలీస్ శాఖ విఫలమవుతోందనే విమర్శలున్నాయి. 14 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు వయసున్న బాలికల భద్రత తల్లిదండ్రులకు సవాలుగా మారింది. స్కూల్‌కు వెళ్తున్న మైనర్లపై దాడులు జరుగుతున్నాయి. మరోవైపు తెలిసీతెలియని వయసులో ఉన్న బాలికలను కొంతమంది ఆకతాయిలు ప్రేమ పేరుతో వంచిస్తున్నారు. తాండూరు పరిధిలో 2024 జనవరి నుంచి 2025 ఆగస్టు వరకు గడిచిన ఇరవై నెలల కాలంలో 37 మంది బాలికలు అదృశ్యమయ్యారు. మరోవైపు మైనర్లపై లైంగిక దాడులకు పాల్పడిన వారిపై 65 పోక్సో కేసులు నమోదయ్యాయి. పోలీసుల అధికారిక లెక్కలు ఇలా ఉండగా.. ఫిర్యాదు చేయని ఘటనలు ఇంతకు మించి ఉంటాయనేది బహిరంగ రహస్యం.

బాలికలపై నమోదైన కేసులు

పోలీస్ స్టేషన్	2024లో		2025లో	
	మిస్సింగ్	పోక్సో	మిస్సింగ్	పోక్సో
తాండూరు	02	13	03	15
కరన్‌కోట్	08	03	03	06
పెద్దేముల్	03	05	04	10
బషీరాబాద్	03	01	0	02
యాలాల	04	05	07	05
మొత్తం	20	27	17	38



సుమోటోగా తీసుకోవాలి

మేజర్ కాదనే కారణంతో పద్దెనిమిదేళ్లకు రెండు నెలలు తక్కువ వయస్సున్న బాలికల వివాహాలను పీటల మీదే ఆపేస్తున్న పోలీసులు, బంధువులతో పాటు పెళ్లి తంతు నిర్వహించే పురోహితుడిపైనా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు. కానీ లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడుతున్న కీచకులపై ఫిర్యాదు చేస్తేనే కేసులు నమోదు చేస్తామనడం దారుణం. ఇలాంటి దుర్మార్గాలను సుమోటోగా తీసుకుంటే బాగుంటుంది.

– మంజుల, తాండూరు

చర్యలు తీసుకుంటున్నాం



రెండేళ్ల వ్యవధిలో 37 మంది మైనర్ బాలికలు మిస్సింగ్ అయ్యారు. వీటిలో సగానికి పైగా ఛేదించాం. మైనర్లపై లైంగిక దాడులకు పాల్పడితే ఫిర్యాదు చేయండి. వివరాలను గోప్యంగా ఉంచుతాం. విద్యార్థినుల రక్షణ కోసం పాఠశాలలు, కళాశాలల వద్ద షీ టీమ్ నిఘా పెడుతోంది.

– బాలకృష్ణారెడ్డి, డీఎస్పీ, తాండూరు

నిత్యం వేధిస్తున్నాడని భర్తను చంపేసింది

మణికొండ: తనను తరచూ వేధిస్తున్నాడనే కోపంతో భర్తను కూరగాయలు కోసే కత్తితో పొడిచి చంపేసింది ఓ భార్య. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి కోకాపేటలో జరిగింది. నార్సింగి ఇన్‌చార్జి సీఐ రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అసోం రాష్ట్రానికి చెందిన కృష్ణంజ్యోతి బోరా (30), బర్క బోరా భార్యాభర్తలు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కోకాపేటలోని ఓ నిర్మాణ సంస్థలో పని చేస్తున్నారు. వారం రోజుల క్రితం భార్యను కొట్టి ఆమెతో గొడవ పడి ఇంట్లోంచి కృష్ణంజ్యోతి వెళ్లిపోయాడు. గురువారం అర్ధరాత్రి మద్యం మత్తులో వచ్చి తలుపులు కొట్టినా ఆమె తీయలేదు. తలుపులను కృష్ణంజ్యోతి బలంగా తన్నటంతో ఇద్దరి మధ్యా గొడవ జరిగింది. బర్క బోరాను కర్రతో కొట్టేందుకు యత్నించగా.. ఆమె పక్కనే ఉన్న కూరగాయలు కోసే కత్తితో అతనిపై దాడి చేసింది. తల, మెడ, కుడి భుజంపై కత్తితో పొడవటంతో కృష్ణంజ్యోతికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి అరుపులు వినిపించడటంతో లేబర్ క్యాంపులో ఉన్న చుట్టు పక్కల వారు వచ్చి చూసే సరికి అతను రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు నిందితురాలు బర్క బోరాని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కృష్ణంజ్యోతి బోరా మృతదేహం

పరిశోధలనపై ప్రత్యేక దృష్టి సారించండి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాజేంద్రనగర్: పశు వైద్యం అభివృద్ధికి, పశు సంపద సంక్షేమానికి విద్యార్థులు తోడ్పడాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పశు వైద్య వృత్తి చాలా భావోద్వేగాలతో కూడుకున్నదని... ఈ రంగాన్ని ఎంచుకున్న వారు పరిశోధనలపై ప్రత్యేక దృష్టి సారించాలని గవర్నర్ సూచించారు. అంతకుముందు గవర్నర్‌కు ఉప కులపతి జ్ఞాన ప్రకాశ్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం 2023-24వ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన 524 మంది విద్యార్థులకు డిగ్రీలు, ప్రశంస పత్రాలను ప్రదానం చేశారు. వారిలో 16 మంది పీహెచ్‌డీ పట్టభద్రులు, ఆరుగురు మాస్టర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, 439 మంది బ్యాచ్‌లర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హస్బెండ్రీ, బీటెక్ డైరీ (టెక్నాలజీ), బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిషరీ సైన్స్ పట్టభద్రులు ఉన్నారు. ప్రతిభ కనబరిచిన 18 మంది విద్యార్థులకు 25 బంగారు పతకాలు, 2 ఉత్తమ ఉపాధ్యాయులకు బంగారు పతకాలను ప్రదానం చేశారు. స్నాతకోత్సవంలో నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ డాక్టర్ మీనేష్ షా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శరత్‌చంద్ర, డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ కిషన్ కుమార్, డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ సతీష్ కుమార్, ప్రొఫెసర్ సత్యనారాయణ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వారు మండల పరిధిలోని చందనవెళ్లిలో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వమన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వస్తాయన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ముందుకు సాగుతోందన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత తమదే అన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమ్మరి చెన్నయ్య, మాజీ సర్పంచ్‌లు మహేందర్‌గౌడ్, రవీందర్‌నాయక్, పార్టీ నాయకులు స్వామి, రాహుల్‌గుప్తా, వేమారెడ్డి, బేగరి యాదయ్య, ప్రభాకర్‌రెడ్డి, కిషోర్‌నాయక్, మాధవరెడ్డి, శేఖర్, గౌరీ, రాఘవేందర్, శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.


సీసీ రోడ్డు, యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కాలె యాదయ్య, మధుసూదన్‌రెడ్డి

ప్రకృతిని కాపాడుకోవాలి: త్రిదండి చినజీయర్‌స్వామి


శంషాబాద్ రూరల్: విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే ప్రకృతి, వనరులను కాపాడుతూ అభివృద్ధి చెందాలని త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి అన్నారు. ముచ్చింతల్ శివారులో ఉన్న శ్రీరామనగరంలో శుక్రవారం నిర్వహించిన 'వికాస్ తరంగిణి-యువ వికాస్' కార్యక్రమంలో భాగంగా హాజరైన జంట నగరాల్లోని వివిధ కళాశాలల విద్యార్థులను ఉద్దేశించి జీయర్ స్వామి ప్రవచనం చేశారు. వ్యక్తిత్వ వికాసం.. జాతీయ భావాలను విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. శ్రీ అహోబిల జీయర్‌స్వామి, ఎంజీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, కళాశాల యూహెచ్‌వీ సెల్ సభ్యుడు డాక్టర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ యాచకురాలిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఇబ్రహీంపట్నం: వృద్ధ యాచకురాలిని గాయపరిచి, అత్యాచారానికి ఒడిగట్టిన కామాంధుడిని ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం కటకటాల వెనక్కు నెట్టారు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఇబ్రహీంపట్నం కొత్త బస్టాండ్ వెనుక ఉన్న షాపు వరండాలో బుధవారం అర్ధరాత్రి ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధ యాచకురాలిపై లైంగికదాడికి పాల్పడిన విషయం విదితమే. ఈ అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడు మంచాల మండలం నోముల గ్రామానికి చెందిన పల్లాటి రవీందర్(38)గా గుర్తించి ఆయన్ను చర్లపల్లి జైల్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే ఇతనిపై గతంలోనూ పలు కేసులున్నాయన్నారు. ఈ ఘటన విషయం తెలియగానే నాలుగు ప్రత్యేక బృందాలు సీసీ ఫుటేజీలు పరిశీలించి, నిందితుడిని పట్టుకున్నట్లు చెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

కబ్జాదారుల చెర నుంచి ప్లాట్లను కాపాడాలి

తుర్కయంజాల్: కబ్జాదారుల చెర నుంచి తమ ప్లాట్లను కాపాడాలని యజమానులు వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటన శుక్రవారం మున్సిపల్ పరిధిలోని మన్నెగూడలో చోటు చేసుకుంది. తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నెంబర్ 510, 511, 512లోని భూమిని 20 ఏళ్ల క్రితం వెంచర్ చేయడంతో తాము ప్లాట్లను కొనుగోలు చేశామని, అయితే కొందరు వ్యక్తులు కొద్ది రోజులుగా ఈ భూమిలో నిర్మాణాలు చేపట్టకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రికార్డుల్లోని లొసగులను ఆసరాగా చేసుకుని ప్లాట్లు అయిన భూమికి పాసు పుస్తకాలను పొందారని ఆరోపించారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు.


వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న ప్లాట్ల యజమానులు

రూ.50 వేల విలువైన మందులు సీజ్

సాక్షి, సిటీబ్యూరో: అనుమతులు లేకుండా మందులు నిల్వ చేసినా, అమ్మకాలు చేపట్టినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ షానవాజ్ ఖాసిం హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారంతో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో దాడులు నిర్వహించిన డీసీఏ అధికారులు రూ.50 వేల విలువైన మందులను సీజ్ చేశారు. ఇందులో యాంటీ బయోటిక్స్‌తో సహా 23 రకాల మందులు, నమూనాలను సైతం స్టోర్ చేశారని తెలిపారు. డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్నారని తెలిపారు. అదే సమయంలో అర్హత లేకుండా మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్నారని గుర్తించామన్నారు. విచ్చలవిడిగా మందులు అమ్మకాల వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయన్నారు. లైసెన్స్ లేని దుకాణాలకు మందులు సరఫరా చేసే హోల్‌సేల్, రిటైల్ డీలర్లపైనా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబరు 1800-599-6969ను సంప్రదించాలని తెలిపారు. పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. తనిఖీల్లో రంగారెడ్డి ఏడీ ప్రసాద్, మహేశ్వరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి. స్రవంతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నేడు

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో శనివారం స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు తెలిపారు. దోస్త్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయి ఖాళీగా ఉన్న మిగతా సీట్లను స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ ఒరిజినల్ మార్కులు మెమోలు, టీసీ, బొనఫైడ్, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు జిరాక్ ప్రతులు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు. వివరాలకు ఫోన్: 70327 13785లో సంప్రదించాలన్నారు.



నిమ్స్‌లో వైద్యం.. అత్యాధునికం

రికార్డు స్థాయిలో రోబోటిక్ సర్జరీలు | **ఇప్పటివరకు 650కుపైగా శస్త్ర చికిత్సలు**

లక్డీకాపూల్: నగరంలోని నిమ్స్ ఆస్పత్రి అత్యాధునిక వైద్య చికిత్సల్లో ముందంజ వేస్తోంది. ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 650కుపైగా రోబోటిక్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేసింది. ఇందులో అత్యధికంగా యూరాలజీ విభాగంలోనే 370 మందికి చికిత్సలందించగా, గ్యాస్ట్రోఎంటరాలజీ, ఆంకాలజీ వంటి విభాగాల్లోనూ ఈ తరహా చికిత్సలు అందిస్తున్నారు. దీని కోసం 20 మంది వైద్యులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. కార్పొరేట్‌లో రూ.లక్షల్లో అయ్యే చికిత్సలు నిమ్స్‌లో ఆరోగ్యశ్రీ కార్డుతో ఉచితంగానే అందిస్తున్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్న నిమ్స్ ఆసుపత్రికి వైద్య ఖర్చుల కింద సీఎంఆర్ఎఫ్, ఆరోగ్య శ్రీ తదితర పథకాల్లో రోబోటిక్ సర్జరీలకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది.

యూరాలజీలో ప్రత్యేక గుర్తింపు..

నగరంలో యూరాలజీ సంబంధిత కేసులకు నిమ్స్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇతర ఆసుపత్రులతో పోల్చితే యూరాలజీ క్రిటికల్ కేసులంటే నిమ్స్ అనే స్థాయికి వచ్చిందని ఆసుపత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, గాల్‌బ్లాడర్, కేన్సర్ తదితర విభాగాల్లోనూ విరివిగా రోబోటిక్ సర్జరీలు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ సహకారంతోనే..



వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న ఉత్తమ చికిత్సా విధానాలను అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. నిమ్స్ క్లినికల్ ఫలితాలను మెరుగుపరుస్తోంది. ఇతర ఆసుపత్రులకు రోల్‌మోడల్‌గా నిలుస్తోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో సహకారం లభిస్తోంది.

– డా.నగరి బీరప్ప, నిమ్స్ డైరెక్టర్

అన్ని వర్గాలకూ భరోసా



రోబోటిక్ సర్జరీలు, నూతన విధానాలను ఎప్పటికప్పుడు సద్వినియోగం చేసుకుంటున్నాం. రోగికి కచ్చితత్వంతో చికిత్స అందించడం, తక్కువ నొప్పి, వేగంగా కోలుకునే అవకాశాలను ఎంపిక చేసుకుంటున్నాం. పేద, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం నిమ్స్‌లో లభిస్తోంది.

– ప్రొ.రాహుల్ దేవ్ రాజ్, నిమ్స్ యూరాలజీ విభాగం హెచ్‌ఓడీ